క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

సోమల: మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సూచించారు. పార్టీ ఎస్సీ విభాగం జిల్లా కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా సందర్భంగా శనివారం సదుం మండలం ఎర్రాతివారిపల్లెలో వారిని కలిసి సోమల దళితవాడకు చెందిన తాతమల్లయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సోమల ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమణయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటరమణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత


పింఛన్ అందజేస్తున్న వలంటీర్

సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లెకు చెందిన చిన్నక్కకు తిరుపతికి వెళ్లి వలంటీర్ పింఛన్ అందజేశారు. ఆమె తిరుపతి సిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొంది కుమారుడు ఇంటిలో ఉంటున్నారు. విషయం తెలుసుకుని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గౌతం, వలంటీర్ రాజశేఖర్ తిరుపతికి వెళ్లి సామాజిక పింఛన్ అందజేశారు. వీరి సేవలను ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

వి.కోట: మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రఘురామ్ తల్లి లక్ష్మమ్మ (80) శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆ గ్రామానికి చేరుకుని ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రెస్కో లైన్‌మన్ మృతి


నాగప్ప(ఫైల్)

కుప్పంరూరల్: రెస్కో లైన్‌మన్ నాగప్ప (46) శనివారం మృతి చెందారు. అనారోగ్యంతో వారం రోజులుగా బెంగళూరులోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం ఆయన మృతదేహానికి స్వగ్రామం చందం దళితవాడలో అంత్యక్రియలు నిర్వహించారు.ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి రెస్కో సిబ్బంది నివాళులు అర్పించారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యసిబ్బంది

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలో శనివారం క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి విజయ్‌చంద్ర మాట్లాడుతూ మద్యపానం, ధూమపానం సేవించ కూడదన్నారు. పొగాకుతో అనేక అనారోగ్యాలు వస్తాయని తెలిపారు. జంక్‌ఫుడ్ తినకూడదన్నారు. చిరుధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు బాగా తినాలని సూచిం చారు. శ్వాసకోస వ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్యసిబ్బంది రాజేశ్వరి, జయమ్మ, భారతి పాల్గొన్నారు.

మహిళా వైద్యులు మహా శక్తులు


సీనియర్ డాక్టర్లను సన్మానిస్తున్న పీజీ డాక్టర్లు

చిత్తూరు రూరల్: మహిళా వైద్యులు మహాశక్తులని సీనియర్ వైద్యాధికారి శేషసాయి అన్నారు. చిత్తూరు నగరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని ప్రసూతి విభాగంలో శనివారం జాతీయ మహిళా వైద్యుల దినోత్సవాన్ని ని ర్వహించారు. సీనియర్ మహిళా వైద్యులు ఉషశ్రీ, శారదను పీజీ డాక్టర్లు, సిబ్బంది సత్కరించి, బహుమతిని అందజేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. డాక్టర్ శేషసాయి మాట్లాడుతూ వైద్య వృత్తి పవిత్రమైందన్నారు. ఈ వృత్తిలో పురుషుల కంటే అధికంగా మహిళా వైద్యులే ఉన్నారని ప్రభుత్వం గుర్తించిందన్నారు. వీరే వైద్యరంగంలో మహాశక్తులని, ఈసేవల్లో మరింత బాధ్యతగా వ్యవహరించాల ని తెలిపారు. వైద్య రంగానికి మంచి పేరు తీసుకునిరావాలన్నారు. వైద్య వృత్తిలో మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వైద్యులు మంజులత, శేషశ్రీ, ప్రశాంతి, అఫ్రీన్, ఇందుజ, కీర్తన, మాధురి, సాహితి, సంయుక్త, అయేషా, లహరి, ఐశ్వర్య, షర్మద, స్ఫూర్తి, అంజుమా పాల్గొన్నారు.

బుల్లెట్ వేగంతో ట్రైన్‌ట్రాక్ పనులు

చెన్నై–మైసూరు హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ ట్రాక్ నిర్మాణ పనులను నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ వేగవంతం చేసింది. హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహిస్తోంది. మరోవైపు భూసేకరణ కోసం రైతులతో సమావేశాలను నిర్వహిస్తోంది. చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే మార్గానికి సమీపంలోనే బుల్లెట్ ట్రైన్ మార్గం అలైన్‌మెంట్‌ను రూపొందించారు. ఈ ట్రైన్ అందుబాటులోకి వస్తే చెన్నై–మైసూరు మధ్య ప్రయాణ సమయం 3గంటలు మాత్రమే.



బుల్లెట్ ట్రైన్

- బుల్లెట్ ట్రైన్ పనులకు మొదలైన ఏరియల్ సర్వే
- ఇప్పటికే ట్రాక్ వేసే మార్గంలో బెంచ్‌మార్కులు
- మూడు రాష్ట్రాల్లోనూ మొదలైన భూసేకరణ సమావేశాలు
- చెన్నై–మైసూర్ మధ్య 435 కి.మీ మేర ట్రాక్ నిర్మాణం


పలమనేరు నియోజకవర్గంలోని కర్ణాటక సరిహద్దులో సాగుతున్న సర్వే

బుల్లెట్ ట్రైన్ ప్రత్యేకతలివి...

ట్రైన్ అత్యధిక వేగం గంటకు: 350 కిలోమీటర్లు
ఆపరేషన్ స్పీడ్ గంటకు: 320 కిలోమీటర్లు
ట్రాక్‌గేజ్: 1,435 మి.మీ లేదా 4.8 ఇంచీలు
ట్రాక్‌గేజ్: స్టాండెర్డ్(1435ఎంఎం) డీఎస్- ఏటీజీ సిగ్నలింగ్
కరెంట్: 25కేవీ ఏసీ, 50హెచ్‌జెడ్ ఓవర్‌హెడ్ క్యాటెనరీ
ట్రైన్ కెపాజిటీ: 750 మంది ప్రయాణికులు
రెండు నగరాల మధ్య దూరం: 435 కిలోమీటర్లు

పలమనేరు: చెన్నై–మైసూరు మధ్య 435 కిలోమీటర్ల మేర హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ ట్రాక్ పనులు ముమ్మరమయ్యాయి. దేశంలోనే ఆరో మార్గంగా దీన్ని జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించనున్నారు. 2020 జూన్‌లో చెన్నై– మైసూర్ రైల్వే కారిడార్ నిర్మాణంపై చర్యలను కేంద్రం ప్రారంభించింది. నాలుగు దశల పనులను పలు కంపెనీలు ఇప్పటికే టెండర్లను పొందిన విషయం తెలిసిందే. నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్) పనులను వేగవంతం చేసింది. మన రాష్ట్రంతోపాటు, తమిళనాడు, కర్ణాటకలోని అరుక్కోణం, కాట్పాడి, వయాడక్ట్‌కొండ, గుడిపాల, బంగారుపేట, మాలూరు తదితర ప్రాంతాల రైతులతో భూసేకరణ కోసం సమావేశాలు నిర్వహిస్తోంది. ఇటీవలే జిల్లాలోని గుడిపాలలో రైతులతో భూసేకణ సమావేశాన్ని నిర్వహించింది. త్వరలో పలమనేరులోనూ ఈ కార్యక్రమం జరగనుంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ మార్గానికి సమీపంలోనే బుల్లెట్ ట్రైన్ మార్గం అలైన్‌మెంట్‌ను రూపొందించారు. ఆమేరకు రెండేళ్ల కిందట ట్రాక్ వెళ్లే చోట్ల సిమెంట్ బెంచి మార్కులను నిర్మించారు. బుల్లెట్ ట్రైన్ కోసం స్థల సేకరణ కోసం రైతులతో అవగాహన కార్యక్రమాలు పూర్తయ్యాక ఎల్‌ఏ నోటిఫికేషన్ వస్తుందని ఈ పనులను పర్యవేక్షిస్తున్న ఓ అధికారి తెలిపారు. ఏదిఏమైనా ఇప్పుడు జిల్లాలో బుల్లెట్ ట్రైన్ ఎప్పుడు వస్తుందనే విషయం జనం నోట్లో నానుతోంది. అంతర్జాతీయ విలువలతో నిర్మించే బుల్లెట్ ట్రైన్ మార్గం ద్వారా భవిష్యత్తులో ఈ ప్రాంతంలో పారిశ్రామీకరణ పెరగడంతో పాటు రైతులకు మార్కెటింగ్, ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలున్నాయి.

గంటకు 350 కి.మీ వేగం

జపాన్, జర్మనీ దేశాల్లో జెట్‌స్పీడ్ బుల్లెట్ ట్రైన్లు నడుస్తున్నాయి. గంటకు 350 కిలోమీటర్ల వేగంగా వెళ్లడం ఈ ట్రైన్ ప్రత్యేకత. ఇప్పటి వరకు మహానగరాలైన చెన్నై నుంచి 320 కిలోమీటర్ల దూరంలోని బెంగళూరుకు అత్యంత వేగమైన శతాబ్ది ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది. ఇందులో గంటకు 70 కి.మీ చొప్పున దాదాపు ఐదు గంటల సమయం పడుతోంది. అదే విమానంలో అయితే గంటన్నర ప్రయాణం. బుల్లెట్ ట్రైన్ అందుబాటులోకి వస్తే ఈ రెండు రాజధానుల మధ్య ప్రయాణ సమయం కేవలం రెండు గంటలే. అదే మైసూరుకైతే మూడు గంటలు పడుతుంది. ఇప్పటికే దేశంలో ముంబై–అహ్మదాబాద్, ఢిల్లీ–వారణాసితో పాటు మరో మూడు మార్గాల్లో బుల్లెట్ ట్రైన్ కారిడార్లున్నాయి.

మూడు రాష్ట్రాల్లో 9 స్టాపింగులు

చెన్నై నుంచి మైసూరు మార్గంలో మూడు రాష్ట్రాల్లో తొమ్మిది స్టాపింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో తమిళనాడులో చెన్నై, పూనమళ్లై, అరుక్కోణం, జిల్లాలో చిత్తూరు సమీపంలోని సరిహద్దు, కర్ణాటకలో బంగార్‌పేట్, బెంగళూరు, చెన్నపట్నం, మండ్య, మైసూర్ ఉన్నాయి. ఈమార్గంలో భాగంగా ట్రాక్ నిర్మాణాలు అండర్‌గ్రౌండ్(సొరంగమార్గం), ఎలివేషన్ వయాడక్ట్, ఓవర్‌హెడ్, ఫ్లైవర్ వంతెనలతో నిర్మాణం సాగనుంది. ఇందులో భాగంగా బెంగళూరు, చెన్నైలో రెండేసి అండర్ గ్రౌండ్ రైల్వే స్టేషన్లు సైతం నిర్మించనున్నారు.



చెన్నై– మైసూరుల మధ్య బుల్లెట్ ట్రైన్ మార్గం మ్యాప్

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న జడ్జి లిఖిత

పలమనేరు: నేటి సమాజంలో మహిళలు, బాలికలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత సూచించారు. పట్టణ సమీపంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ బాల్య వివాహాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, ర్యాగింగ్, ఉమెన్ ట్రాఫికింగ్, ప్రాథమిక హక్కులు, విధులు, బాధ్యతలను వివరించారు. ఎస్‌ఐ సహదేవి, ప్రిన్సిపల్ మహమూద్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

పలమనేరు కోర్టులో మార్చి9న జరిగే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి లిఖిత తెలిపారు. కేసుల రాజీ కోసం పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. కక్షిదారులు రాజీమార్గాన్ని ఎంచుకోవడం చాలా ఉత్తమమని తెలిపారు. సీఐ చంద్రశేఖర్, పలు స్టేషన్ల ఎస్‌ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవరావు, పక్కన న్యాయమూర్తులు కార్తీక్, సింధు

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో మార్చి 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌కు అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవరావు తెలిపారు. శనివారం అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి సింధుతో కలసి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కార్తీక్ కోర్టు ఆవరణలో పోలీసులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. వాసుదేవరావు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించే వేదికగా లోక్ అదాలత్‌లు రావడం అభినందనీయమన్నారు. అదాలత్ పరిధిలోకి వచ్చే కేసులన్నింటినీ పరిష్కరిస్తామని తెలిపారు. లోక్ అదాలత్ తీర్పు ఫైనల్ అని, మళ్లీ అప్పీలుకు అవకాశం లేదన్నారు. డబ్బు, సమయం వృథా చేసుకోకుండా కక్షదారులు అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవాలని సూచించారు. అన్నిశాఖల అధికారులు కక్షిదారులకు అవగాహన కల్పించి కేసులు పరిష్కారంలో కీలకపాత్ర పోషించాలని కోరారు. ఈ సమావేశంలో సీఐ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో మహిళలే కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న శతావధాని ఆముదాల మురళి

పలమనేరు: దేశ అభివృద్ధిలో మహిళలే కీలకమని ప్రముఖ శతావధాని ఆముదాల మురళి తెలిపారు. రామకృష్ణ సేవా సమితి, స్థానిక తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో జాతి పునరుద్ధరణలో మహిళల పాత్ర అనే అంశంపై స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశం బాగుంటుందని తెలిపారు. పురుషులకు ఏమాత్రం తీసిపోని విధంగా నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రామకృష్ణ, తులసీనాథం నాయుడు, సుధాకర్‌రెడ్డి, అత్యుతానంద, ప్రిన్సిపల్ ప్రశాంతి పాల్గొన్నారు.

బదిలీ తహసీల్దార్లకు సత్కారం


పలమనేరు: కుప్పస్వామికి సన్మానం


చౌడేపల్లె: మాధవరాజుకు సత్కారం

పలమనేరు: పలమనేరు తహసీల్దార్ కుప్పుస్వామిని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సన్మానించారు. ఆయన పలమనేరు ఆర్‌డీవో కార్యాలయానికి బదిలీ అయిన సందర్భంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రంగన్న, వైస్ ఎంపీపీ గజేంద్రబాబు, పీఏసీఎస్ చైర్మన్ రాజారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: తహశీల్దార్‌గా మాధవరాజు కర్నూలుకు బదిలీ అయిన సందర్భంగా శనివారం రెవెన్యూ సిబ్బంది సత్కరించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులు పాల్గొన్నారు. ఆయన సేవలను కొనియాడి సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఎంపీపీ రామమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంజిబాబు, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో 'పల్లెకు పోదాం'

వి.కోట: త్వరలో ప్రారంభం కానున్న పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని బీజేపీ పలమనేరు అసెంబ్లీ కన్వీనర్ గొనివారి విజయ్‌కుమార్ కోరారు. శనివారం మండలంలోని జ్యూస్ పార్క్ వద్ద బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా నాయకులు గ్రామాల్లో ప్రతి ఇంటింటికీ వెళ్లి కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సంఘం నూతన కార్యవర్గం


సంఘు నూతన కార్యవర్గం

చౌడేపల్లె: వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడిగా రెడ్డిరాజా(లద్దిగం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్వోలతో సమావేశం జరిగింది. ఉపాధ్యక్షుడిగా టి.రెడ్డెప్ప(దుర్గసముద్రం), కార్యదర్శిగా జి.రెడ్డెప్ప(గడ్డంవారిపల్లె), కోశాధికారిగా టి.భాస్కర్ బాబు(పెద్ద కొండామర్రి)ని ఎన్నుకున్నారు. వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని రెడ్డిరాజా తెలిపారు.

తహసీల్దార్ హత్యపై నిరసన


నిరసన తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

శాంతిపురం: విజయనగరం జిల్లా కొండేపల్లె తహసీల్దార్ రమణయ్య హత్యపై స్థానిక రెవెన్యూ ఉద్యోగులు శనివారం నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జిలు ధరించి మండల సచివాలయం వద్ద నినాదాలు చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వ ఉద్యోగులపై దాడుల నివారణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రమణయ్య కుటుంబానికి సంఘీభావం తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ కొలేష్, ఆర్ఐ మధుసుదన్, సర్వేయర్ సద్దాం, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్టాపన

పలమనేరు: మండలంలోని మొరం పంచాయతీ రామాపురంలో ఆదివారం శ్రీవరసిద్ధి వినాయకుని శిలావిగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. హోమ పూజలు ఉంటాయన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

7న నీలగిరి వృక్షాల వేలం

శాంతిపురం: చిన్నారిదొడ్డి పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూముల్లోని నీలగిరి వృక్షాలను ఈనెల 7వ తేదీన వేలం ద్వారా విక్రయించనున్నట్టు సర్పంచ్ రేణుక తెలిపారు. ఉదయం 10 గంటలకు సచివాలయంలో జరిగే వేలంలో చింతమానికుంట, కొత్తపేట పెద్ద చెరువు, రాసాయకుంట చెరువులోని వృక్షాలను విక్రయిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు రూ.30 వేలు ధరావత్తు చెల్లించి వేలం పాటల్లో పాల్గొనాలని కోరారు.

క్లీన్ కుప్పానికి సహకరించండి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్

- వ్యర్థాలను రోడ్లపై వేస్తే చర్యలు
- మున్సిపల్ చైర్మన్ సుధీర్
- మాంసం దుకాణదారుల సమావేశం

కుప్పం: మున్సిపల్ పరిధిలో మాంసం దుకాణదారులు పరిశుభ్రతకు సహకరించాలని చైర్మన్ డాక్టర్ సుధీర్ తెలిపారు. శనివారం మటన్, ఫిష్, చికెన్ షాపుల యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యర్థ పదార్థాలను ఎక్కడపడితే అక్కడ పడేస్తుండడంతో పారిశుధ్యం లోపిస్తుందని తెలిపారు. ఈ వ్యర్థ పదార్థాలు వల్ల వచ్చే దుర్గంధంతో ప్రజలు అనారోగ్యం పాలౌతున్నారు. వ్యర్థ పదార్థాలను మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు వచ్చినప్పుడు అందజేస్తే డంపింగ్ యార్డుకు తరలిస్తారని పేర్కొన్నారు. అలా కాకుండా ఇష్టానుసారంగా రోడ్డుపైన, ఎక్కడపడితే అక్కడా వేయడం సరికాదన్నారు. చికెన్, మటన్, ఫిష్ ధరల పట్టికను దుకాణాల ముందు ఏర్పాటు చేయాలని, అందరు ఒకే ధరకు అమ్మకాలు చేపట్టాలని సూచించారు. వ్యర్థ పదార్థాలను రోడ్లపైన వేస్తే మున్సిపల్ యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామని హె చ్చరించారు. కమిషనర్ రాధిక, అర్బన్ ఎస్ఐ సుబ్బా రెడ్డి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మ్యాంగో మార్కెట్ గదుల వేలం

పలమనేరు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద శివుని కుప్పం మ్యాంగో మార్కెట్ గదుల బహిరంగ వేలం ప్రక్రియ శనివారం ప్రశాంతంగా జరిగింది. అక్కడి మార్కెట్‌లో 42 దాకా దుకాణాలను ఏర్పాటుకు సంబంధించి మార్కెటింగ్ అధికారులు వేలం నిర్వహించారు. ఓ గదికి నెలకు సర్కారువారిపాట రూ.2,200గా నిర్ణయించగా, హెచ్చు వేలం అత్యధికంగా రూ.2,800కు ఖరారైంది. ఈ వేలం పాటలో స్థానిక ఏఎంసీ పరిధిలోని వ్యాపారులు పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, మార్కెటింగ్ ఆర్‌జేడీ రామాంజినేయులు, డీఈ హరినారాయణ రెడ్డి, ఏడీ పరమేశ్వరన్, మార్కెట్ సెక్రటరీ సంజీవకుమార్ పాల్గొన్నారు.

ఉపాధిలో రూ.99,762 రికవరీకి ఆదేశం

- 16వ విడత సామాజిక తనిఖీలో పీడీ గంగాభవాని


వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఆర్పీ మీరావల్లీ

సోమల: ఉపాధీ హామీ పథకంలో లెక్కలు తేలని పనులకు సంబంధించి రూ.99,762 రికవరీ చేయాలని పీడీ గంగాభవాని ఆదేశించారు. శనివారం స్థానిక ఉపాధి కార్యాలయం వద్ద 2022–23 వరకు ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులకు సంబంధించి 16వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ ఏపీఓ దినకర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీల వారీగా చేపట్టిన పనులను ఎస్ఆర్పీ మీరావల్లీ వినిపించారు. మండలంలో రూ.10.55 కోట్ల పనులు చేపట్టినట్టు తెలిపారు. వీటిలో మండలం మొత్తం కలిపి పంచాయతీ రాజ్, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించి రూ.94,233 వేలు, ఉపాధి పనులకు సంబంధించి రూ.5,529 వేల రికవరీకి పీడీ గంగాభవాని ఆదేశించారు.అలాగే 2024–25కు సంబంధించి కొత్త పనులకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఎంపీపీ ఈశ్వరయ్య,ఏఎంసీ మాజీ చైర్మన్ అమాస మోహన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న పనులను కూలీలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ ప్రభాకర, డీవీఓ భాగ్యలక్ష్మి, క్వాలిటీ కంట్రోల్ అధికారి ఆనంద్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఏపీడీ శ్రీనివాసులు, పులిచెర్ల ఏపీఓ షౌకత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఔట్లపై మున్సిపాలిటీ కొరడా


సూర్యనగర్ లేఔట్‌లో బోర్డులు ఏర్పాటు చేస్తున్న టీపీఓ సుభప్రద

పుంగనూరు: పట్టణంలో మున్సిపల్ ఆదాయానికి గండికొడుతూ అనుమతులు లేకుండ వ్యాపారాలు చేస్తున్న అక్రమ లేఔట్లలో బోర్డులు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ నరసింహప్రసాద్ శనివారం తెలిపారు. పట్టణంలోని సూర్యనగర్, రాగానిపల్లె రోడ్డులోని సర్వేనంబర్లు 242/5, 234/1, 234/5లోని మున్సిపల్ భూముల్లో అక్రమ వ్యాపారాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ సుభప్రద, సిబ్బంది కలసి బోర్డులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయాలని దీనిపై సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్‌కు తెలిపామన్నారు. ఎవరైనా మున్సిపల్ అనుమతి పొంది వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. అక్రమ లేఔట్లలో కొనుగోలు చేసిన ఇంటి స్థలాలకు మున్సిపల్ అనుమతులు మంజూరు చేయమని స్పష్టం చేశారు. ప్రజలు ఈ విషయాలను గమనించాలని కోరారు. పట్టణంలో ఇలాంటి లేఔట్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వరసిద్ధుని సేవలో ప్రముఖులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, సాయంత్రం బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ శివ శ్రీనివాస్(ఐఏఎస్) కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటిండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్, విష్ణు, బీసీ వెల్ఫేర్ శాఖ అధికారులు పాల్గొన్నారు.


ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర దేవదాయ శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్ పరిశీలించారు. ఆయన శనివారం ఉదయం కాణిపాకం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు లడ్డూపోటు భవనం, నూతన క్యూ కాంప్లెక్స్ స్థలం, సామూహిక కల్యాణ మండపం, అన్నదాన సత్రం ఆధునికీకరణ, బస్టాండ్ నుంచి ఆ లయానికి వెళ్లే దారిలో శిల్పాలతో అన్వేటి మండపాలను నిర్మించడానికి స్థలం పరిశీలించారు. ఆలయ ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు శివాంజనేయులు, అరవింద్, కాంట్రాక్టర్ శ్రీధర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు మండల కేంద్రానికి సమీపంలో జూద(మంగతాయి) శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. జూదం ఆడుతున్న పీలేరుకు చెందిన ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.22,250 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చేసుకొన్నట్లు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రతి ఒక్కరికీ వైద్యం


టి.పుత్తూరులో వైద్య పరీక్షలు

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రతి ఒక్కరికీ వైద్యం అందిస్తున్నట్లు వైద్యాధికారులు ప్రియాంక, వినయ్ కుమార్ తెలిపారు. మండలంలోని పైమాఘంలో శనివారం డాక్టర్ ప్రియాంక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. టి.పుత్తూరులో డాక్టర్ వినయ్‌కుమార్ గర్భవతులు, బాలింతలు, వృద్ధులకు పరీక్షలు చేశారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి మాత్రలు పంపిణీ చేశారు. సీహెచ్‌ఓ రాజామణి, ఆరోగ్య కార్యకర్తలు శ్రీనివాసులు, సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు పావని, మానస, ఏఎన్‌ఎం రోజా, డీఈఓలు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఇంటి వద్దే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని పేరయ్యగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 90 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.